

# యద్రివ్నష్టు రసమవశ్చ్యుమ్యన్నం

బాబు కథ సాగించాడు :

ఆయనా. ఆ అవస్థ శత్రువుకూ్కడా వద్దు. మూడ్రోజుల్నించి జరుగుతోంది ఆ కథ. రెండ్రోలు ఆయన నన్ను ఖాతరు చెయ్య లేదు. వట్టి సూపర్‌స్టిషన్ అని కొట్టి పారేసాడట .... చివరికి ఏ పనీ తెమలక ఖర్చు తడిసిమోపెడయేసరికి, తోటివాళ్ళు ఆయనకి సలహా ఇచ్చారు. "కలియుగ కుబేరుడు చాలా సత్యమైన దేముడు. తక్షణం వెళ్ళి ఒక్క బీడీ వేసి పుచ్చుకో" అని. ఆయన మూడ్రోలునుండి ఒక్క సెట్‌మీద తిప్పలు పడుతున్నాడు. అందులో హీరోకి ఓడైలాగు అనడం బాగా కుదరటంలేదు. అందులో ఓ మాట మార్చాలి. దానికి డైలాగు రైటరు రావాలి. ఆయన అండర్‌గ్రౌండులో వుంటూ, ఇపుడు ఇంకో కంపెనీకి రాస్తున్నాడు. అంటే ఏ దాసప్రకాశ్ హోటలో, వుడ్‌లాండ్సో, కన్నెమెరానో నన్నమాట. ఆ రైటరుకి ఓ ప్రొడ్యూసరు బైముకి డబ్బివ్వలేదట. ఆ కోపం కొద్దీ ఆ ప్రొడ్యూసరు శత్రువు పిక్చరుకి

అడ్వాన్సేనా అడక్కుండా సొంతఖర్చుమీద అహోరాత్రాలు చెడ రాసేస్తున్నాడు ఆ కవి. మధ్యని ఈ నిర్మాత అవస్థపడుతున్నాడు.

"ఆ డైలాగేదో ఈ ప్రొడ్యూసరో, డైరెక్టరో యాక్టరో డిస్ట్రిబ్యూటరో మార్చి పారెయ్యొచ్చుగా. అది మామూలేగా" అన్నాడు రాజు.

మామూలే అనుకో, ఈసారి ఆమాట ఎవ్వరికీ కొరకుడు పడడం లేదట అన్నాడు బాబు.

"సందర్భాన్నిబట్టి ఇంకో డైలాగు రాసేస్తే?"

వెర్రినాయనా ఏమాత్రం వీలైనా వీళ్ళు సందేహిస్తారా? సందర్భం తెలియటం అనేది కథమీద ఆధారపడి ఉంటుంది. కథ డిస్ట్రిబ్యూటరుల మీద, హీరోయన్‌ల గార్డియన్‌ల మీదా ఆధారపడి ఉంటుంది. ఇంతకీ పిక్చరు సగమన్నా కాకుండా కథ ఏమిటో ఎవరుమాత్రం చెప్పగలరు?

సినిమాకథలు వారఫలాల వంటివి. గ్రహబలాలనుబట్టి మారుతాయి. చెప్పొచ్చింది. ఆ సందర్భం సంగతి కద్నూ. అది లౌసీనట. హీరో ప్రియురాలి జుట్టు నిమురుతూ "ప్రియా ఈ యద్రివ్నగ్జరసమవశ్చక్ర న్నానికి కారణమేమిటి?" అని అడుగుతాడుట.

"అది చెప్పడం కొంచెం ఇబ్బందే కదా". "వాటీజ్‌దిస్ నాన్సెన్సు" అన్నాడట హీరో.

"వాటీజ్ ది ఇంగ్లీషుమీనింగు సార్" అని అడిగాడట దాన్ని తమిళంలోకి తర్జుమా చేసేకవి. సెట్‌మీద అందరూ తర్జన భర్జనలు జరిపారు.

కొందరు అర్థం గంభీరంగా ఉంది గాని మాట కొంచెం తేటగా ఉండాలన్నారు. తేలికగా రాసినమూలానే షేక్స్పియరు మహాకవి అయ్యాడని మరికొందరు ఇంగ్లీషులో అన్నారు. ఇంతకీ సంగతేమిటో తేలలేదు.

" 'కారణ మేమిటీ' అని డైలాగు చివర ఉంది కాబట్టి ఆ 'యద్రివ్నగ్జరసమవశ్చత్రున్నం' అన్నమాటకి అర్థం ఉండాలిగదా. చెట్టో చేమో, జబ్బో జీబూతమో, తల్లో పూలో, పేలో ఏదో ఒకటీ అఘోరించాలి గదా అదేదో తేలకుండా ఎలా మార్చడం?"

"పోనీ హీరోయిన్ జవాబు డైలాగురాసి ఉంటుందిగా, దాని అర్థంబట్టి—" అన్నాడు రాజు నానుస్తూ.

హీరోయిన్ జవాబు ఏమిటో తెలుసా? కారణమేమిటీ అంటాడు గదా వీడు? ఆవిడ ఏమో ఏమిటో అంటుంది. కాపోయినా హీరోయిన్ డైలాగులికి అర్థం ఏమిటి?"

"హారినీ చిక్కే"

"మరే అముక్కే ఆ వాళ్ళంతా అనుకుని ఏంతోచక రైటరుకోసం వెతుకుతున్నారు. అందుకే ఇందాకటాయన ఇష్టంలేకపోయినా నన్ను బీడీ అడిగి పట్టుకెళ్ళాడు తాయెత్తుగా. ఈపాటికి పని అయుండాలి మరి" అంటూ లేచాడు బాబు.

* * * *

అంతలోకే ఒక ఆసామి అటువేపొచ్చి, బాబుని చూసి భక్తితో దండం పెట్టి, "గురూ నువ్వు నిజంగా కుబేరుడివే," అన్నాడు.

కుబేరుడి గుండె గభేలుమంది. "ఈ సిగరెట్టు వచ్చినా ఇవ్వను. ఇది వీరిచ్చారు. ఇది పని చెయ్యదు" అన్నాడు. చేతిలో సిగరెట్టు నోటబెట్టేసుకుని.

"వద్దులే ఆ డైలాగు మిష్టరీ తెలిసిపోయింది. తెలుసా! ఆ రైటరు దొరికాడట. అర్థం చెప్పేశాడు. సాయంత్రం చిన్న టీపార్టీ గట్రా ఉంది. నిన్ను పిలవమన్నారు" అన్నాడాయన.

"ఏమిటట అర్థం" అన్నాడు బాబు.

"ఆ ఏంలేదు. ప్రేయసీ! ఈ పూవులు నవ్వడానికి కారణం ఏమిటీ? అనిట, ఆవిడ 'ఏమిటో' అంటుంది. అంతే వడ్డగింజలో ఆవగింజ ఇంతాచేసి" అన్నాడాయన.

"అయితే ఆ మాటకి నిజంగా అర్థం ఉందన్నమాట"

ఎబ్బే అలాంటి మాటే లేదుట. ఆయన ఏదేదో రాయబోయి ఏదో రాస్తూ కొట్టేస్తూ, రాయబోయిన మాట మర్చిపోయాడు. తీరా దానికి సాపు రాసినాయన అదేదో గంభీరపు డైలాగు అని అనుమానపడి ఆ కొట్టివేతల అక్షరాలన్నీ పోగేసి ఒక మాటలా కట్టాడు. అది నానా గొడవా చేసింది. ఏమైతేనేం నీ బీడీ మూలాన రైటరు పట్టు బడ్డాడు. వాడిమూలాన సంగతి తెలిసి కథ కదిలింది. వస్తా గురూ" అని వెళ్ళి పోయాడు ఆపెద్ద మనిషి.

"బ్రదర్. చూశావా అంతా చెత్త అని తెలిసినా నా మహిమను మాత్రం ఇంకా నమ్ముతున్నారు. ఇప్పుడు చెప్పు నేనెవర్ని?" అన్నాడు కుబేరుడు గర్వంగా.

"ఎవడివైనా సరేకాని కుబేరుడివి మటుకు కావు. వఠి సూపర్‌స్టిషన్. మూఢనమ్మకం. బాష్."

అంటూ బేడబిళ్లు చెల్లించుకున్నాడు రాజు.

"సెబాష్" అన్నాడు కుబేరుడు పకపక నవ్వి. "నేను ముందే అనుకున్నాను నువ్వు ఈ ఫీల్డుకి పనికిరావని. నా కథనీ నన్ను చెత్తకింద జమకట్టడంతోనే నీ అయోగ్యత ఋజువైంది."